# విపశ్యన మాసపత్రిక

VOLUME:22 NO - 13 1 APRIL, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


## "ధర్మవాణి"

*సుఖో బుద్ధానముప్పాదో, సుఖా సద్ధమ్మదేసనా !*
*సుఖా సఙ్ఘస్స సామగ్గీ, సమగ్గానం తపో సుఖో !!*

*– ధమ్మపదపాళీ – 194, బుద్ధవగ్గో*

**బుద్ధులు ఉదయించటం సుఖకరం, సద్ధర్మ ఉపదేశాలు దొరకటం సుఖకరం, సంఘం ఏకమవటం సుఖకరం, అందరూ కలిసి సాధన చేయటం సుఖకరం.**

# బుద్ధుని బోధనలేమిటి?

## మొదటి ప్రవచనము, రెండవ భాగం (23 సెప్టెంబర్ 1951)

– సయాజీ ఊ బా ఖిన్

(రంగూన్‌లోని సిగ్నల్ పగోడా రోడ్డున కల మెథడిస్ట్ చర్చిలో ధర్మజిజ్ఞాసకుల సభలో బర్మా ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్ సయాజీ ఊ బా ఖిన్, మూడు ప్రవచనాలిచ్చారు. వాటిని పూజ్య గురూజీ శ్రీ సత్యనారాయణ గోయంకా గారు హిందీలో అనువదించారు. వాటి అనువాదాన్ని ఇక్కడ వరుసగా ప్రచురిస్తున్నాము.)

### మహాభినిష్క్రమణ (గృహత్యాగం)

సమయం గడిచే కొద్దీ ఈ ఉల్లాసవంతమైన వాతావరణం పట్ల సిద్ధార్థ రాకుమారుడు విసుగుచెందాడు. బుద్ధత్వాన్ని పొందటానికి లెక్కలేనన్ని గత జన్మలలో తన కుశల కర్మల ద్వారా పూర్తి చేసుకున్న పారమితలు స్వతహాగా మేల్కొనటం మొదలుపెట్టాయి. ఈ ఉల్లాసవంతమైన జీవితం తన మనసు మీద నియంత్రణ కోల్పోయిన క్షణాల్లో, సమాధి బలంతో అతని అంతరాంతాలలోని ప్రశాంతత, విశుద్ధి పైకి ఎగదన్నేవి.

ఇలా మెల్లగా రాకుమారునిలో అంతర్యుద్ధం మొదలయింది. విషయ-వాసనల బంధనాల నుండి ముక్తి పొందాలని మనసు ఉద్విగ్నత చెందసాగింది. ఒక్కసారైనా బయటకు వెళ్లి ఆ అంతఃపుర నాలుగు గోడల బయట ఏముందో తెలుసుకోవాలనే బలమైన కోరిక కలిగింది. అతడు బయటనున్న ప్రకృతిని అంతఃపురంలోని కృత్రిమ రూపంలో కాకుండా, సహజ రూపంలో చూడాలనుకున్నాడు. దానితో అతడు అంతఃపురం వెలుపలనున్న తన ఉద్యానవనంలో విహరించటానికి వెళతానని అడిగాడు. తనకిష్టం లేకపోయినా శుద్ధోదన మహారాజు అంగీకరించక తప్పలేదు. కానీ, దారి పొడవునా రాకుమారునికి ఎటువంటి అప్రియ సంఘటనలూ కనబడకూడదని తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ, అంతఃపురం నుండి బయటకు రాగానే అతడు నడుము వంగిపోయి ఉన్న ఒక ముసలి వ్యక్తిని చూశాడు, తరువాత ప్రాణాంతకమైన రోగంతో వ్యాకులపడుతున్న రోగిని చూశాడు, మూడవసారి ఒక శవాన్ని చూశాడు, చివరకు వైరాగ్యం పొందిన ఒక సన్యాసిని చూశాడు.

ఈ నాలుగు దృశ్యాలూ రాకుమారుడిని గంభీర ఆలోచనల్లో పడేశాయి. అతని మానసిక స్థితిలో ఎంతో మార్పు వచ్చింది. వికారాలు తొలగిపోయి, **సంఖారలోకం** లో (మానసిక చేతనా లోకంలో) తాను ప్రోగు చేసుకున్న అనంత పారమితల శక్తులతో తన మనసు జతకలిసింది. ఇప్పుడు అతని మనసు మరింత బంధరహితంగా, ప్రశాంతంగా దృఢంగా మారింది. ఇవన్నీ కూడా భార్య యశోధరా పుత్రునికి జన్మనిచ్చిన రోజు రాత్రే జరిగాయి. అంటే తన భావబంధనాలు మరింత గట్టిపడే పరిస్థితి. అయినా, ఇప్పుడు ఎలాంటి బంధనాలూ సిద్ధార్థున్ని బంధించలేకపోయాయి, ఎలాంటి ఆటంకాలూ అతనిని ఆపలేకపోయాయి, మరో ఆలోచనేదీ అతనిని మార్చలేకపోయింది. అతడు జన్మ, జరా, మరణాల నుండి బయటపడటానికి సత్యమార్గాన్ని తప్పకుండా అన్వేషించాలి అనే దృఢ నిశ్చయం తీసుకున్నాడు. అతని ఈ సంకల్పానికి అతడు ఎన్నో జన్మల నుండి ప్రోగు చేసుకున్న **అధిష్ఠాన పారమీ** వలన కలిగిన అపూర్వమైన బలం ప్రాప్తించింది. అర్ధరాత్రి వేళలో రాకుమారుడు ఇంటి నుండి బయటకు వెళ్ళాలనే అంతిమ నిర్ణయం తీసుకున్నాడు. అతడు "చన్నా" అనే సేవకుడిని పిలిచి తనకు ప్రియమైన అశ్వం "కంథక" ను సిద్ధం చేయమని ఆదేశించాడు. ఆ తరువాత భార్య యశోధరా మరియు నవజాత పుత్రుడు రాహులుని ఒకసారి చూసి, కుటుంబ జీవనం నుండి శాశ్వతంగా విముక్తి పొంది మహాభినిష్క్రమణ (గృహత్యాగం) చేశాడు. అతడు రాజధానిని వదిలి, అనోమా నదిని దాటిన తరువాత, అభీష్టసిద్ధిని ప్రాప్తించుకోకుండా తిరిగి రాను అని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

### సత్యాన్వేషణ

మహాభినిష్క్రమణము తరువాత, సిద్ధార్థ రాజకుమారుడు, సన్యాసి దుస్తులు ధరించి, భిక్షాపాత్ర చేతపట్టుకుని, తగిన గురువుల కొరకు అన్వేషిస్తూ సంచరించాడు. ఆయన, అలార కలాముడు, మరియు ఉద్ధక రామ పుత్రుడు అనే సుప్రసిద్ధ బ్రాహ్మణ గురువుల వద్ద శిష్యరికం చేశాడు. వీరిలో ఆలార కలాముడు, ఆత్మకి ప్రాధాన్యతనిస్తూ, భౌతిక బంధనాల నుండి విడివడినప్పుడే ఆత్మకి నిజమైన విముక్తి అని బోధించాడు. ఇది రాజకుమారునికి తృప్తినివ్వలేదు. ఆ తరువాత అతడు ఉద్ధక రామ పుత్రుని వద్దకు వెళ్ళాడు. ఉద్ధకుడు, కర్మఫలానికి, ఆత్మ యొక్క పునర్జన్మలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. వీరిద్దరూ కూడా 'ఆత్మ' భావన నుండి బయటకు రాలేకపోయారు. అప్పుడు, "నేర్చుకోవటానికి ఇంకా ఏదో ఉంది" అని సన్యాస రాజకుమారుడు తలచాడు. దానితో ఆయన, ఆ ఇద్దరినీ వదిలి ముక్తి యొక్క అన్వేషణను తనంతటతానుగానే చేయాలనుకున్నాడు. అప్పటికే ఆయన, ఎనిమిది ధ్యాన సమాపత్తులలో (సమాధులలో) నిష్ణాతుడై అతీంద్రియ శక్తుల ప్రయోగంలో ప్రావీణ్యత

సాధించి భూత భవిష్యత్తు కాలాలకు చెందిన ఎన్నో కల్పాలలో జరిగిన, జరగబోయే సంఘటనలను చూడగలిగే శక్తిని కూడా పొందగలిగాడు. కేవలం లౌకిక జగత్తుకే చెందినవి కావటంతో, ఇవన్నీ జన్మ, జరా, మరణాల దుఃఖం నుండి బయటపడటమే ఆయన ముఖ్య ఉద్దేశ్యం.

ఆ తరువాత ఆయనతో అయిదుగురు సన్యాసులు జత కలిశారు. వారిలో ఒకరైన కొండన్న అనే సన్యాసి, సిద్ధార్థుడు పుట్టిన ఐదవరోజున జాతకం చూసి, ఆయన తప్పకుండా బుద్ధుడవుతాడు అని జోస్యం చెప్పిన జ్యోతిష్యుడు. ఈ ఐదుగురు సన్యాసులు, ఆరు సంవత్సరాల పాటు ఆయనకెంతో సేవ చేశారు. ఆ ఆరు సంవత్సరాల్లో ఆయన రకరకాల కఠోర నియమాలతో తనను తాను హింసించుకుంటూ, ఉపవాసాలతో శుష్కింపచేసుకుంటూ, ధ్యానం చేసుకుంటూ దాదాపుగా అస్తిపంజరంలాగా మిగిలిపోయాడు. అలా ఒకరోజు, ఒంట్లో సత్తువలేక, నీరసంతో కళ్ళు తిరిగి కుప్పకూలి పడిపోయాడు. ఆ తరువాత, ఆయన తన పద్ధతిని మార్చుకుని, మధ్యేమార్గాన్ని అవలింబించాడు. ఈ మధ్యేమార్గమే తనకు ముక్తి లభింపచేస్తుందని ఆయన తెలుసుకోగలిగాడు.

## బుద్ధత్వ ప్రాప్తి

నేటికి 2540 సంవత్సరాల పూర్వం *(2019 నాటికి అయితే సుమారు 2600 సంవత్సరాలు అవుతుంది - అనువాదకుడు)* వైశాఖ పూర్ణిమ సాయం సమయంలో తపస్వీ రాజకుమారుడు, ఇప్పటి బుద్ధగయ సమీపంలోని ఉరువేలా వనంలో నిరంజరా నది ఒడ్డుకు చేరుకుని, అక్కడ బోధివృక్షం క్రింద బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు. ఆయన, "పరమ సత్యాన్నీ", సమ్యక్ సంబోధినీ పొందే వరకూ కదలకుండా ఆసనంలో కూర్చునే ఉంటాను, ఈ ప్రయత్నంలో నా ప్రాణాన్ని కోల్పోయినా సరే" అనే దృఢ ప్రతిజ్ఞ తీసుకుని కూర్చున్నాడు.

సత్య శోధనకు ఏకాగ్రచిత్తం అవసరం. ఏకాగ్రచిత్తుడు కావటానికి తపస్వి రాజకుమారుడు అత్యంత ప్రయత్నశీలుడు అయ్యాడు. శుభ ఘడియలు సమీపించసాగాయి. తాపస్వి తన సమస్త మానసిక శక్తులను ఏకాగ్రపరిచాడు. మామూలుగా అయితే సులభంగానే ఏకాగ్రత చెందే మనసు, ఈ రోజు చంచలంగా ఉందని ఆయన గమనించాడు. ఉన్నత శ్రేణులకు చెందిన మనోవృత్తులు, నిమ్న శ్రేణికి చెందిన మనోవృత్తులతో సంఘర్షణ పడుతున్నాయని, ఈ సంఘర్షణ కారణంగా మానసిక ఏకాగ్రతకు మాటిమాటికీ ఆటంకం కలుగుతున్నదని గమనించాడు. విఘ్నాలను కలిగిస్తుండే ఈ శక్తులు పెట్టే ఇబ్బందులు ఎంత దృఢంగా ఉన్నాయంటే, తన అంతరాలలోని ప్రకాశపు కిరణాలు వీటిని చేధించలేకపోయాయి. ఇవన్నీ ఆ తపస్వికి కొత్త అనుభవాలే. ఇంతకు మునుపెన్నడూ ఇలా జరగలేదు. బుద్ధత్వం ప్రాప్తించటానికి ఇదే అంతిమ సంగ్రామం కాబట్టి, ఇలా జరుగుతున్నదేమో! దుష్టప్రవృత్తుల రూపంలో ఉన్న తన సమస్త విరోధ శక్తులతో కూడిన దుష్ట మారుడు, స్వయంగా యుద్ధంలోకి దిగాడు. అయినా తపస్వి స్థైర్యాన్ని కోల్పోలేదు. ఆయనకు ఎదురవుతున్న విఘ్నాలనూ, అంతరాయాలన్నింటినీ నిబ్బరంగా ఎదుర్కొంటూ పోయాడు. ఈ అంతిమ యుద్ధానికి అనివార్యమైన కుశల పుణ్యకర్మలను అతడు లెక్కలేనన్ని పూర్వజన్మలుగా సంచయం చేసుకుంటూ వచ్చాడు. అవి అవసరమయ్యే సన్నివేశం ఆసన్నమైంది, వాటి బలం అందింది కూడా. తన పది పారమితలను పరిపూర్ణం చేసుకునేందుకు తాను చేసిన మహావ్రతానికి దేవతలు, బ్రహ్మలు కూడా సాక్షులే. సమ్యక్ సంబోధిని అడ్డుకుంటూ ఉన్న దుష్ట ప్రవృత్తులను జయించేందుకు తాను చేస్తున్న అంతిమ యుద్ధంలో పాల్గొనేందుకు వారికి కూడా ఆహ్వానం పలికాడు. అప్పుడు తన స్వార్జిత పారమితలకు, దేవ-బ్రహ్మల పరమ పరిశుద్ధమైన మానసిక శక్తులు తోడయి ఇంతవరకూ అభేద్యంగా అనిపించిన ఘనీభూత దుష్టశక్తులు ఇప్పుడు ఛిన్నా-భిన్నం అవటం మొదలయింది. మానసిక నియంత్రణ బలపడిన కారణంగా, ఆ బాధలన్నీ శాశ్వతంగా నశించిపోయాయి. ఇలా బాధలన్నీ నశించిపోగానే రాజకుమారుడు, మానసిక ఏకాగ్రతను మరింత తీవ్రతరం చేశాడు. ఫలితంగా ఆయన మనసు ప్రశాంతమై, నిర్మలమయింది. ఇప్పుడు, మెల్ల మెల్లగా లోపలి ప్రజ్ఞాచైతన్యం ఉబికిరావటం మొదలయింది. ఆ పరమ చైతన్య స్థితిలో, ఇంతవరకూ సమాధానాలు దొరకని ప్రశ్నలకు కూడా స్వతహాగా వాటంతటవే సమాధానాలు దొరకటం మొదలయింది. సాధకుడు, లోతయిన అంతర్దృష్టి ద్వారా తనను తాను తెలుసుకున్నాడు; ప్రకృతి సత్యాన్ని పరీక్షించి చూశాడు, ఇంత ఘనంగా అనిపించే ఈ శరీరం నిజానికి ఎంతో నిస్సారమైనదనే విషయం ఆయనకు స్పష్టంగా అర్థమయింది. ఈ శరీరం కేవలం లెక్కలేనన్ని కోటానుకోట్ల పరమాణువుల, కలాపాల సమూహం మాత్రమేనని, ఒక్కో కలాపం ఎంత సూక్ష్మమైనది అంటే, గ్రీష్మఋతువులో (ఎండాకాలంలో) రథచక్రంతో పైకి ఎగసిపడే చిన్న ధూళి కణంలో 46,656 వ భాగం మాత్రమేనని ఆయన తెలుసుకున్నాడు. ఇంకా ధ్యాసతో చూస్తే, ఈ పరమాణువుల సమూహాలు కూడా ఎంతో చంచలమైనవి, మార్పుచెందుతూనే ఉన్నాయి, నిత్యమైనవి కావు, స్థిరమైనవి కావు అని కూడా తెలుసుకున్నాడు. అలాగే, మనసుది కూడా ఇదే పరిస్థితి. అది కూడా ఎంతో అస్థిరమైనది, చంచలమైనది; పుడుతూ - గిడుతూ ఉండే ధర్మం కలది. మానసిక శక్తుల ప్రతినిధే మనసు. ఉత్పత్తి చెందే (సృష్టించే) మానసిక శక్తులు ఏవైతే ఉన్నాయో అవి మన లోపలి నుండి బయటివైపుకు, ఉత్పన్నమైనవి (సృష్టించబడినవవి) బయటి నుండి మన లోపలకు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటాయి. ఈ మానసిక శక్తుల ప్రవాహము యొక్క ఈ క్రమపద్ధతి, అనాదికాలం నుండి అవిచ్ఛిన్నంగా నడుస్తూనే ఉంది.

ఇప్పుడు, తన జ్ఞాననేత్రాలు తెరుచుకున్నాయి అని సిద్ధార్థుడు తెలుసుకున్నాడు. ఇక ఈ జ్ఞాననేత్రాలతో స్వయంనిరీక్షణ చేసి చూసుకుని, ఇవన్నీ నిస్సారమైనవే అని అర్థం చేసుకున్నాడు. తీక్షణమైన సమాధితో కూడిన సూక్ష్మదృష్టితో ఆయన, మరొకసారి పరీక్షించి చూశాడు. వాటి అనిత్య స్వభావం మీద ధ్యాస పెట్టి చూస్తే, అవన్నీ నశించి పోయేవేనని, వాటికి తమ స్వంత అస్తిత్వమేదీ లేదు అని గమనించాడు. అవి కేవలం స్వభావాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. కేవలం '**ప్రజ్ఞప్తి**', అంటే ఆపాదించబడినదే అంటే కనిపించేది. ఈ విధంగా ఈ ఆపాదించబడిన సత్యాన్ని గమనించి, ఆయన పరమార్థ సత్యాన్ని (అంతిమ సత్యాన్ని) చేరుకున్నాడు, సత్యస్వభావం యొక్క జ్ఞానాన్ని పొందాడు.

ఇలా ఆయన, తన శరీరంలోని నామరూపాలు (మనసు, శరీరము), చైతన్యము-జడము (కదిలేది-కదలనిది) - ఇవి రెండూ ఎల్లప్పుడూ మార్పు చెందేవే అని తెలుసుకుని దుఃఖాన్ని సాక్షాత్కారం చేసుకున్నాడు. అలా జరగగానే ఆయన మనసులోని అహంభావం మొత్తం కరిగిపోయి, ఆయనలోని ఆత్మభావం మచ్చుకైనా మిగలకుండా, ఆత్మ (నేను, నాది అనే భావన) పట్ల ఉన్న ఆసక్తి అంతా సమాప్తమైపోయి, దుఃఖ నిరోధ స్థితికి చేరుకున్నాడు. శరీరచిత్తాలు రెండూ కూడా ఎంత సారంలేనివో, ఎంత నిస్సారమైనవో స్పష్టంగా అర్థం చేసుకున్నాడు. ఈ శరీరచిత్తాల కలయిక నిరంతరం ప్రవహిస్తూ, మార్పుచెందుతూనే ఉంటుంది. కార్య-కారణ సిద్ధాంతం యొక్క నిర్ధారిత నియమాల చేత నియంత్రింపబడుతుంది. ప్రతీత్య-సముత్పాద, అంటే కారణముంటేనే కార్యము ఉంటుంది అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ ఉంటుంది. దీనిని తెలుసుకోగానే సత్యం పూర్తిగా సాక్షాత్కారమయ్యింది. బోధిసత్త్వుడు సంగ్రహించుకున్న బుద్ధత్వపు అనంత గుణాలు జాగృతమయ్యి, వైశాఖ పూర్ణిమ నాటి ఆ రాత్రి గడవక ముందే, అంటే తూర్పు దిక్కున రవికిరణాలు ఉదయించకముందే, ఆయన బుద్ధత్వాన్ని పొందాడు. సిద్ధార్థ

రాజకుమారుడు నిజంగానే సమ్యక్ సంబోధిని పొంది సమ్యక్ సంబుద్ధుడు అయ్యాడు, జాగృతుడయ్యాడు, బోధిని పొందాడు, సర్వజ్ఞుడయ్యాడు. అంటే, ఇతరులందరూ నిద్రపోతూ కలలు కంటున్న సమయంలో ఆయన జాగృతుడయ్యాడు. ఇతరులు అంధకారంలో సంచరిస్తూ తడుముకుంటున్న సమయంలో ఆయన బోధిని పొందాడు. ఇంకా, ఇతరులు కేవలం అవిద్యలోనే ఉన్న సమయంలో ఆయన సర్వజ్ఞుడయ్యాడు.

ఓ సజ్జనులారా! ఈ రోజు నేను మీ సమయం చాలా తీసుకున్నాను. మీరెంతో శాంత చిత్తంతో, ఓపికగా నేను చెప్పింది విన్నారు. దానికి మీకందరికీ నా ధన్యవాదాలు. ఈ చర్చిలో ఈ సభను నిర్వహించి, నేను మీ ముందు ప్రసంగించే అవకాశాన్నిచ్చిన నిర్వాహకులందరికీ నేనెంతో కృతజ్ఞుడను.

## రెండవ ప్రవచనము

### మొదటి భాగము (30 సెప్టెంబర్ 1951)

ఓ సజ్జనులారా!

గత ఆదివారం బుద్ధుని జీవిత చరిత్రలో బుద్ధత్వాన్ని పొందటం వరకూ జరిగిన సంఘటనలను సంక్షిప్తంగా మీ ముందు ఉంచాను. ఇక ఈరోజు, బుద్ధుని బోధనలమీద దృష్టి పెడతాను. బుద్ధుని బోధనలన్నీ త్రిపిటకాల్లో పొందుపరచబడి ఉన్నాయి. త్రిపిటకాల్లో సుత్త (ప్రవచనాలు), వినయ (భిక్షు-సంఘం యొక్క నియమాలు), అభిధమ్మ (దర్శనం) అనే మూడు పిటకాలు ఉన్నాయి. ఇవి పాళీ భాషలో ఎన్నో గ్రంథాలుగా సంకలనం చేయబడి ఉన్నాయి. త్రిపిటకాలు ఎంత విశాలమైనవి అంటే, ఒక పాళీ భాషా పండితునికి కూడా, ఈ గ్రంథాలు అన్నీ కేవలం ఒకసారి చదవటానికి కొన్ని నెలల సమయం పడుతుంది. కాబట్టే, నేను నేటి ప్రవచనాన్ని బుద్ధుని బోధనల సారాన్ని, మూల సత్యాలను తెలుసుకోవటానికి మాత్రమే పరిమితం చేస్తాను.

తన ధర్మోపదేశాన్ని ఆరంభించటానికి ముందుగా సమ్యక్ సంబుద్ధుడైన భగవానుడు 49 రోజుల పాటు (ఏడు వారాలు) మౌనంగా గడిపాడు. ఆయన మొదటి ఏడు రోజులు బోధివృక్షం యొక్క నీడలో గడిపాడు. ఆ తరువాత, ఒక్కొక్క వారం చొప్పున ఆ బోధివృక్షం సమీపంలోని ఆరు వేర్వేరు స్థలాల్లో గడుపుతూ, విముక్తిసుఖం యొక్క ఆనందాన్ని ఆస్వాదిస్తూ పరమార్థ ధర్మసూక్ష్మతలను గురించిన చింతన-మననలతో గడిపాడు. ఈ విధంగా ఆలోచిస్తూ ఆయన **పట్ఠాన** (హేతు ఫలవాదం) యొక్క నియమాలు మరియు మనసు-మనోవృత్తుల మధ్య ఉండే సూక్ష్మాతిసూక్ష్మమైన పరస్పర సంబంధాలను సంపూర్ణంగా విశ్లేషించగానే, ఆయన దేహం నుండి ఆరు వర్ణాల ఉజ్వలకిరణాలు వెలువడి, మెల్లమెల్లగా ఆయన ముఖమండలాన్ని చుట్టుముట్టి, కాంతివలయ రూపంలో స్థిరపడ్డాయి. భగవానుడు ఈ ఏడు వారాలూ భోజనం చేయకుండానే గడిపాడు. ఈ సమయంలో భగవానుని జీవనం సాధారణ వ్యక్తులలాగా స్థూలంగా, ఘనరూపంలో కాకుండా, సూక్ష్మ, మానసిక స్థాయిలో ఉన్నది. సూక్ష్మలోకాల్లో నివసించే దేవతలు, బ్రహ్మలు మొదలైన వారు తమ పోషణకు స్థూల భోజనం చేయాల్సిన అవసరం ఉండదు. ధ్యానంతో కలిగే ప్రీతి-సుఖమే వారికి భోజనం, ఆహారం అవుతుంది. ఇది వారికెంతో శ్రేష్ఠమైన పోషణతత్త్వం. భగవానుడు కూడా ఈ ఏడు వారాల పాటు ఈ పోషణతత్త్వాన్నే ఆధారం చేసుకుని జీవించాడు. ఎందుకంటే ఆయన స్థూల ఘనరూప స్థాయిలో కాకుండా, సూక్ష్మమానసిక స్థాయిలో గడిపాడు. కాబట్టి అంత ఉన్నతమైన మానసిక, బౌద్ధికస్థితిలో ఉన్న బుద్ధ భగవానునికి ఇది అసంభవమేమీ కాదు అనే పూర్తి నమ్మకం మనకు కలుగుతుంది.

ఈ ఏడువారాల సుదీర్ఘకాలం తరువాత, యాభైవరోజు సూర్యుడు ఉదయించే సమయానికి భగవానుడు ధ్యానం నుంచి లేవగానే ఆయనకు భోజనం చేయాలని అనిపించింది. అంటే, ఏడువారాల నిరంతర ఉపవాసం తరువాత ఆయనెంతో ఆకలిగొని వ్యాకులతతో ఉన్నాడని కాదు. కానీ సూక్ష్మ మానసిక స్థితి నుండి స్థూల ఘనీభూత స్థితిలోకి రాగానే ఆకలివేయటం స్వాభావికమే.

సరిగ్గా అదే సమయంలో ఈ దేశానికే (బర్మా దేశానికే) చెందిన ఇద్దరు వ్యాపారులు వారి ఇతర సిబ్బందితో కలిసి ఉరువేలా వనం గుండా ప్రయాణిస్తూ ఉన్నారు. ఆ వనంలోని ఒక వన దేవత, గత జన్మల్లో ఈ వ్యాపారులకు దగ్గరి బంధువు. సమ్యక్ సంబుద్ధుడయిన భగవానుడు తన ధ్యానం నుండి ఇప్పుడిప్పుడే లేచాడని, వెళ్లి ఆయనకు నమస్కరించి, సాదర సత్కారాలు చేసి, మహాపుణ్యంలో పాలుపంచుకోమని వీరిద్దరినీ ఆ వనదేవత ప్రోత్సహించింది. దానితో, వాళ్ళిద్దరూ ఆరు వర్ణాల కిరణాల కాంతివలయంతో ప్రకాశిస్తున్న బుద్ధ భగవానుడు కూర్చున్న చోటుకి వెళ్ళారు. ఆ అపూర్వ దర్శనంతో వ్యాపారులిద్దరూ శ్రద్ధాళువులయ్యారు. ఇద్దరూ భగవానునికి సాష్టాంగనమస్కారం చేసుకుని, తమతో తీసుకువచ్చిన బియ్యంతో చేసిన ఆహారము, తేనెలతో కూడిన భోజనాన్ని సమర్పించారు. ఇదే బుద్ధభగవానుని మొట్టమొదటి భోజనం. భగవానుడు ఇద్దరినీ భక్తి శ్రద్ధలు కలిగిన గృహస్థ శ్రావకులుగా స్వీకరించాడు. వారు భగవానుని నుండి సెలవు తీసుకునే ముందుగా, సుదూరదేశంలోని తమ ఇళ్ళకు చేరుకున్నాక పూజించటానికి గుర్తుగా ఏదయినా ఇవ్వమని అడిగారు. భగవానుడు అనుగ్రహపూర్వకంగా తన తల నుండి ఎనిమిది కేశధాతువులు ఇచ్చాడు. తపస్సు- భల్లిక అనే ఈ వ్యాపారులిద్దరూ ఈ రంగూన్ నగారానికే చెందిన వాళ్లు అని తెలుసుకుంటే మీకు ఆశ్చర్యం వేయవచ్చు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని "ఒక్కలాపా" అనే పేరుతో పిలిచేవారు. ఇక్కడ మీరు ఈ సుప్రసిద్ధ ష్వేడగాన్ పగోడాని చూస్తున్నారు కదా, దీని క్రిందనే ఆ ఎనిమది కేశధాతువులను స్థాపించారు. 2540 సంవత్సరాల క్రితం ఒక్కలాపా దేశ రాజుగారి పర్యవేక్షణలో ఆ పవిత్ర కేశధాతువులపై ఈ చైత్యాన్ని/ చైత్రాన్ని నిర్మించటమైనది. ఆ తరువాతి కాలంలో, సమయానుగుణంగా ఎందరో గొప్ప రాజులు, ఉపాసకులు దీనిని సంరక్షించి అభివృద్ధి చేశారు.

ఈ విధంగా ఒక్కలాపాకు చెందిన ఈ వ్యాపారస్థులకు బుద్ధభగవానుని ప్రథమ ఉపాసకులు అయ్యే అదృష్టం వరించింది. అయితే వారు కేవలం శ్రద్ధావంతులైన ఉపాసకులు మాత్రమే కావటం ఎంతో దురదృష్టకర విషయం కూడా. వారు బుద్ధునికి ప్రాప్తించిన ధర్మసాధనను ఎంతమాత్రం ఆచరించలేదు, అనుభూతి చెందలేదు. అలా సాధన చేయకపోతే, జన్మ, జరా, మరణాల కారణంగా వచ్చే దుఃఖం నుండి ఎలా విముక్తి పొందగలరు? అయితే, సాధన ప్రారంభించటానికి ముందు శ్రద్ధ కలిగి ఉండటం తప్పనిసరే. కానీ, బుద్ధుని బోధనలను సాధకుడు స్వయంగా ఆచరించి సాధన చేయటమే ముఖ్యమైన విషయం. ఎందుకంటే సాధకుడు ఈ సాధనను తానే స్వయంగా అభ్యాసం చేయవలసి ఉంటుంది. కాబట్టే భగవానుడు, ***"తుమ్హేహి కిచ్చం ఆతప్పం అక్ఖాతారో తథాగతా"*** అని చెప్పాడు.

అంటే, "కార్యసిద్ధి కొరకు తపస్సయితే (సాధనయితే) నీవే చేయాలి, తథాగతులు కేవలం మార్గనిర్దేశనం మాత్రమే చేస్తారు."

-- తరువాయి భాగం వచ్చే సంచికలో.

--- సయాజీ ఊ బా ఖిన్ జర్నల్ నుండి సంగ్రహించబడినది.

## ప్రియమైన ధర్మ సహోదరులారా,

2019వ సంవత్సరంలో, విపశ్యన విద్య తన పుట్టినిల్లయిన భారతదేశంలో తిరిగి ప్రవర్తమానమౌతూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. ఈ అమూల్యరత్నంతో ధర్మలాభం పొంది తమ జీవితాల్లో మంచి మార్పును అనుభవించిన అందరికీ ఇది ఒక విశిష్టమైన అవకాశం. మనకు ఈ విద్య అందించటానికి ఇంతకు ముందు తరాల వారు పడిన శ్రమను కృతజ్ఞపూర్వకంగా స్మరించుకునే సమయం ఇది. ఇప్పుడు మన వంతుగా నేటి సమాజానికి, భావితరాలకు ధర్మలాభం అందించాల్సిన సదవకాశం ఆసన్నమైంది. విపశ్యన ప్రచార సమితి, ఈ సంవత్సరం 100 ప్రభుత్వ పాఠశాలల్లో ఆనాపాన సాధనను ప్రవేశపెట్టటానికి ప్రణాళికను తయారుచేస్తోంది. ***'సబ్బదానం ధమ్మదానం జినాతి'*** – ధర్మదానానికన్నా ఉత్తమమైనది వేరొకటి ఉండదు. కాబట్టి ఈ పుణ్యకార్యంలో పాల్గొనే అవకాశం దొరకటం ఎంతో అదృష్టం. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు క్రింది నెంబర్లలో సంప్రదించగలరు.

**పురుషులు:**

భాస్కర్ – 9494850793, జి.వి.సుబ్రమణ్యం – 9441780727, లక్ష్మయ్య – 7989580605, లింగమూర్తి – 9440592191, లింగారెడ్డి – 9490220598, మురళి – 9491309077

**మహిళలు:**

పద్మజ – 9396742494, సరోజ్ – 7893966441, సుగంధారెడ్డి – 9704534356, సురేఖ – 9391639224, వీణా – 9491868381, సుజాత – 9848195316

## కిశోర వయస్కుల శిబిరాలు

**బాలురు –**

05 ఏప్రిల్ నుండి 13 ఏప్రిల్ వరకు – ధమ్మ నాగార్జునలో
15 మే నుండి 23 మే వరకు – ధమ్మ కొండన్నలో

**బాలికలు –**

14 ఏప్రిల్ నుండి 22 ఏప్రిల్ వరకు – ధమ్మ నాగార్జునలో
16 మే నుండి 24 మే వరకు – ధమ్మ నాగార్జునలో

## OWNERSHIP OF VIPASSANA MASAPATRIKA AND OTHER INFORMATION

| | |
|---|---|
| 1. Name of the Masapartrika | **Vipassana Masapatrika** |
| 2. Registration Nos of the News Paper | APTEL/17745 |
| 3. Language | Telugu |
| 4. Frequency of Publication | Monthly |
| 5. Publisher's Name | Smt. Sabrina Katakam |
| 6. Nationality | Indian |
| 7. Adress | Vipassana International Meditation Centre 12/3 M, Nagarjunasagar Road, Sahebnagar, Vanastalipuram, Hyderabad-500 070. |
| 8.Printer's Name | Sri Y.Venkateswar Rao |
| 9. Nationaity | Indian |
| 10. Address | Flat No.15, Saikrupa Apartments Red Hills, Lakdikapool, Hyderabd - 500 004 |
| 11. Editor's Name | G.V.Subrahmanyam |
| 12. Nationality | Indian |
| 13. Adress | 11-13-114, Road No.2 Alkapuri Colony, Hyderabad - 500 102 |
| 14. Place of Publication | Vipassana International Meditation Centre 12/3 M, Nagarjunasagar Road, Sahebnagar, Vanastalipuram, Hyderabad - 500 070. |

I, Sabrina Katakam, declare that the above mentioned information is true to the best of my knowledge.

Date: 1-4-2019 **Sabrina Katakam, Publisher**


రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** **విపశ్యన తెలుగు మాసపత్రిక** జీవిత చందా రూ. **500/-**

ప్రచురణ తేది: ప్రతినెల **30/31** పోష్టింగ్ తేది: ప్రతి నెల **1/2** వెల: రూ **5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం)** ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం **9**గం॥ల నుండి సాయంత్రం **5** గం॥ల వరకు

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :


**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.